బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 21 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4

## ఆరుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి బాధ్యతలు అప్పగించింది. ఇదిలా ఉంటే, ఇప్పటి వరకు ఆమ్రపాలికి కొన్ని అదనపు బాధ్యతలు ఉండగా వాటి నుంచి ప్రభుత్వం రిలీవ్ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి పూర్తి బాధ్యతలు చేపట్టనుండగా మూసీ నది డెవలప్‌మెంట్ ఎండీగా దానకిషోర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ కమిషనర్‌గా కోట శ్రీవాత్సవ, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్, హెచ్ఎండబ్ల్యూఎస్ (హైదరాబాద్ వాటర్ వర్క్స్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మయాంక్ మిట్టల్‌ను ప్రభుత్వం నియమించింది.






- పదేళ్లుగా తెలంగాణ తల్లి గుర్తురాలేదా?
- రాజీవ్ విగ్రహాన్ని టచ్ చేయండి చూద్దాం
- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా, ఆ పార్టీ నేతలకు బలుపు తగ్గలేదన్నారు. మీ బలుపు తీసే బాధ్యత కాంగ్రెస్ పార్టీదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని, శంషాబాద్ ఎయిర్ పోర్టు పేరు మారుస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సోమాజిగూడలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. పీసీసీ మాజీ చీఫ్ వీహెచ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ ఇన్‌ఛార్జ్ మున్షీ, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు. దేశంలో విప్లవాత్మక మార్పులకు రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలు బలోపేతం అయ్యింది రాజీవ్ గాంధీ హయాంలోనే అన్నారు. డిసెంబర్ 9లోపు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు తెలంగాణ తల్లి గుర్తురాలేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా బలుపు తగ్గలేదన్నారు.

మిగితా 2వ పేజీలో

## 'చీఫ్ మినిస్టర్.. నా మాటలు గుర్తుంచుకోండి'



- అధికారంలోకి వచ్చిన తొలిరోజే సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తాం
- విద్యార్థుల ముందు చెత్త మాటలా..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. 'చీఫ్ మినిస్టర్ రేవంత్, నా మాటలు గుర్తుంచుకోండి' అంటూ ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించిన ఆయన, భారత్ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన రోజే అంబేద్కర్ సచివాలయం పరిసరాల్లో నుంచి చెత్తను తొలగిస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి లాంటి ఢిల్లీ గులాంలు తెలంగాణ ఆత్మ గౌరవం, తెలంగాణ గొప్పతనాన్ని అర్థం చేసుకుంటారని ఆశించలేమని వ్యాఖ్యానించారు. పాఠశాల విద్యార్థుల ముందు చెత్త మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి నైజం, వ్యక్తిత్వం, ఆయన పెంపకాన్ని సూచిస్తోందని మండిపడ్డారు. మానసిక రుగ్మత నుంచి రేవంత్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు కేటీఆర్ ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలోని పరిస్థితులు ఎలా ఉన్నాయో వివరించేందుకు ఇవే తార్కాణాలు అని ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండు ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు.

నిజామాబాద్‌లో పోలీసుల వేధింపులతో విసుగుచెందిన ఓ స్వీట్ షాపు యజమాని తన దుకాణాన్ని మూసివేస్తూ ఒక బ్యానర్ పెట్టారని తెలిపారు. ఒకవైపు ఇలా నిజామాబాద్‌లో చిన్న వ్యాపారులను వేధించడంలో బిజీగా ఉంటే.. మరోవైపు వరంగల్‌లోని రద్దీ రహదారిపై నిర్వహించిన కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో ఏసీపీ పాల్గొన్నారని వెల్లడించారు. ఈ వేడుకల్లో క్రాకర్స్ కాల్చడం వల్ల అమాయకులు గాయపడ్డారని మండిపడ్డారు.

## వైద్యుల భద్రతకు జాతీయ టాస్క్ ఫోర్స్..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ గత 10 రోజులుగా వైద్యులు దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు మంగళవారం ఓ జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. డాక్టర్ల భద్రత గురించి టాస్క్ ఫోర్స్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మెడికల్ ప్రొఫెషనల్స్ ఎవరైనా సరే.. వారికి సామాజిక భద్రత కల్పించడమే ఆ టాస్క్ ఫోర్స్ ఉద్దేశంగా పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా డాక్టర్ల భద్రత గురించి ఏకాభిప్రాయాన్ని క్రియేట్ చేయాలని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ బృందంలోని సభ్యుల పేర్లను కూడా సుప్రీం వెల్లడించింది.

జాతీయ టాస్క్ ఫోర్స్ బృందం జాబితా: సర్జర్ వైస్ అడ్మిరల్ ఆర్ సరిన్, డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎం శ్రీనివాస్ , డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ గోవర్దన్ దత్ పురి, డాక్టర్ సౌమిత్ర రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా(ఎయిమ్స్ కార్డియాలజిస్ట్), ప్రొఫెసర్ పల్లవి సప్రే (ముంబై గ్రాంట్ కాలేజీ డీన్), డాక్టర్ పద్మ శ్రీవాత్సవ్ (ఎయిమ్స్ న్యూరాలజీ) ఉన్నారు. వీరితో పాటు భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వం హోం కార్యదర్శి, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, జాతీయ మెడికల్ కమీషన్ చైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ప్రెసిడెంట్ ఆ జాబితాలో ఉన్నారు.

**వైద్యులు వీలైనంత త్వరగా విధుల్లోకి చేరండి.. సుప్రీంకోర్టు విజ్ఞప్తి**

వైద్యులు సమ్మెను విరమించి తమ విధుల్లోకి చేరాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కోరింది. వైద్యుల నిరసనతో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు సమ్మెను విరమించి తమ విధుల్లోకి చేరాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కోరింది.మరోవైపు ఈ హత్యాచార కేసును సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారిస్తున్న విషయం తెలిసిందే. ఆ బెంచ్‌లో జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలు ఉన్నారు. విచారణ సందర్భంగా జూనియర్, సీనియర్ డాక్టర్ల భద్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, డాక్టర్ల సమ్మెతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ మేరకు వైద్యులు వెంటనే సమ్మె విరమించి తమ విధుల్లోకి చేరాలని కోరింది. 'వైద్యులందరి భద్రత, సంక్షేమానికి సంబంధించిన విషయాలను కోర్టు పరిశీలిస్తున్నందున.. ప్రస్తుతం విధులకు దూరంగా ఉన్న వైద్యులు వీలైనంత త్వరగా తిరిగి విధుల్లోకి చేరాలని మేము కోరుతున్నాము' అని సుప్రీం ధర్మాసనం తెలిపింది.

## కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఢిల్లీ మద్యం కేసులో మధ్యంతర బెయిల్ కోసం సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణను ఈ నెల 27కు వాయిదా పడింది. ఈ కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసిందని, ఈడీ కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్‌ఎస్వీ రాజు కోరారు. దీనికి కవిత తరఫు న్యాయవాదులు బుధవారంలోగా కౌంటర్ దాఖలు చేస్తే శుక్రవారం విచారణకు తాము సిద్ధంగా ఉన్నామన్న తెలిపారు. స్పందించిన ఈడీ తరఫు న్యాయవాది తమకు సమయం కావాలని గురువారంలోపు దాఖలు చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారంలోపు రీజాయిండర్ దాఖలు చేయాలని కవిత న్యాయవాదులకు ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.ఈ కేసులో ఈడీ, సీబీఐలు.. ఛార్జిషీట్‌లు, కంప్లైంట్ కాపీలు దాఖలు చేయడంతోపాటు దర్యాప్తు ముగిసిందని ట్రయల్ కోర్టుకు చెప్పాయని కవిత న్యాయవాదులు సుప్రీంకు తెలిపారు. సీబీఐ కౌంటర్‌పై విచారణ చేపట్టాలని కోరగా రెండు పిటిషన్లు ఒకే సారి విచారణ చేపడతామని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవి విశ్వనాథన్‌ల ధర్మాసనం పేర్కొంది. హైకోర్టులో కేసు డైరీ ఉండగా కౌంటర్ దాఖలు చేయడానికి ఆలస్యం ఎందుకని ధర్మాసనం ప్రశ్నించింది. ఈడీ తమకు నోటీసులు ఇచ్చాక తొలిసారి కేసు ఇక్కడ విచారణకు వచ్చిందని, సవివరంగా కోర్టుకు వివరాలు అందిస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ కోర్టుకు చెప్పారు.

ఈ కేసు మొత్తంలో ఉన్నది ఒకే మహిళని, కవిత బెయిల్‌కు అర్హురాలని ఆమె తరఫు న్యాయవాదులు వాదించారు. ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న మనీష్ సిసోదియా, అర్వింద్ కేజ్రీవాల్‌కి బెయిల్ మంజూరు చేశారని కవితకు బెయిల్ ఇవ్వాలని ఆమె తరఫు న్యాయవాది

మిగితా 2వ పేజీలో

## హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం..

- తడిసి ముద్దయిన నగరవాసులు
- ట్రాఫిక్‌తో ఇబ్బందులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో మంగళవారం వర్షం దంచికొట్టింది. ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, అమీర్‌పేట, ట్యాంక్‌బండ్, నారాయణగూడ, కవాడిగూడ, బషీర్‌బాగ్, హిమాయత్ నగర్, కోఠి, బేగంబజార్, అబిడ్స్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. వర్షానికి రోడ్లపై భారీగా వరద నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర



ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. మరో వైపు రాగల ఐదురోజుల పాటు హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- విద్యాసంస్థల సెలవులపై కలెక్టర్లకే నిర్ణయాధికారం
- ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదురుకోవడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, నూతన రెవెన్యూ చట్టం -2024 ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి , జిల్లా కలెక్టర్లతో మంగళవారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఐదు రోజుల్లో వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు.గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా వీలైనంత మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల



సంతృప్తి వ్యక్తం చేశారు.భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని గురించి మంత్రిగారు కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు.

ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.జిల్లా కలెక్టర్లు ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలిసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రతి కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజధానికి ఏ

మిగితా 2వ పేజీలో



## రాజీవ్ సూచనలతోనే హైదరాబాద్‌లో ఐటి రంగానికి పునాది

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సూచనలతోనే హైదరాబాద్‌లో ఐటి రంగానికి పునాది పడిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దేశ ప్రగతికి రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని, దేశంలో టెక్నాలజీని రాజీవ్ విస్తృతం చేశారని కొనియాడారు. సోమాజిగూడలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ ఇంఛార్జీ దీపాదాస్ మున్షీ విహెచ్, మేయర్ విజయలక్ష్మి, జగ్గా రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ ఐటి రంగానికి రాజీవ్ పునాదాలు వేశారన్నారు.రాజీవ్

మిగితా 2వ పేజీలో

## రైతు రుణమాఫీపై రేపు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు

- ఆంక్షలు లేకుండా రైతులం దరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్
- మండల కేంద్రాలు/ నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలకు బీఆర్ఎస్ పిలుపు
- ముఖ్యమంత్రి రుణమాఫీ పూర్తయిందని మాటలు చెప్తుంటే.. మంత్రులు మనిషికో మాట చెబుతున్నారు
- రాష్ట్రంలో 40 శాతం మంది రైతన్నలకు కూడా అందని రుణమాఫీ
- వెంటనే అందరికీ వ్యవసాయ రుణ మాఫీ చేస్తామని ప్రకటన చేయాలి
- అప్పటిదాకా ప్రభుత్వం పైన పోరాటం ఆగదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ 22వ తేదీన అన్ని మండల కేంద్రాలు/నియోజకవర్గ కేంద్రాల్లో భారత రాష్ట్ర సమితి తరఫున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతన్నలు కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ప్రయోజనం పొందకపోవటంతో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని కార్యక్రమం కొనసాగుతుందని చెబుతున్నారన్నారు. ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతూ రైతన్నలను అయోమయానికి, ఆవేదనకు గురి చేయటమేమిటనీ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రెండు లక్షల వరకు రుణమాఫీని అందరికీ వర్తింప చేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్నికలు కాగానే రైతు రుణమాఫీ కోసం రూ. 40 వేల కోట్ల రూపాయలు అవసరమని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారని కానీ కేబినెట్ మాత్రం కేవలం 31 వేల కోట్లకు మాత్రమే అనుమతిచ్చిందన్నారు. ఇక బడ్జెట్లో 26 వేల కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపి రైతులను మోసం చేసే కార్యక్రమం చేశారన్నారు. బడ్జెట్ లో కేటాయించిన రూ. 26 వేల కోట్లలో నుంచి కేవలం 18 వేల కోట్ల రూపాయలే ఖర్చు చేసి రైతులను నిలువునా ముంచింది తీవ్రంగా మండిపడ్డారు. రైతు రుణమాఫీ జరగక ఆందోళన చేస్తున్న రైతులకు అండగా ఉండాల్సింది పోయి మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను మరింత గందరగోళానికి గురి చేసిన విధంగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.




కనీసం 40% మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ధి చేకూరలేదని క్షేత్రస్థాయి నుంచి తమకు సమాచారం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి కారణంగా లక్షలాది మంది రైతన్నలు రోజు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని వెంటనే చేయాలని ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

డిసెంబర్ 9 లోగా రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఆ తర్వాత ఆగస్టు 15 అంటూ మరోసారి మాట తప్పారని కేటీఆర్ మండిపడ్డారు. అడ్డగోలు ఆంక్షలు పెట్టి రైతులకు రుణమాఫీ అందకుండా చేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. లక్షలాది మంది రైతన్నలకు అండగా ఉండేందుకు ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువచ్చేందుకే ఈనెల 22వ తేదీన అన్ని మండల కేంద్రాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతన్నలకి ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణ మాఫీ అందే వరకు భారత రాష్ట్ర సమితి తరఫున ప్రభుత్వం పైన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## పండుగ పూట ఆర్టీసీ రికార్డు

- రాఖీ పౌర్ణమి నాడు రికార్డు స్థాయిలో ప్రయాణికులు
- ఆర్టీసీ బస్సుల్లో ఒక్కరోజే 63.86 లక్షల మంది రాకపోకలు
- మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకున్న 41.74 లక్షల మహిళలు
- ఆర్టీసీ సిబ్బందికి, ఉన్నతాధికారులకు మంత్రి పొన్నం అభినందనలు



ఫైల్ ఫొటో

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రికార్డు స్థాయిలో 63.86 లక్షల మందిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసిందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కరోజులో 41.74 లక్షల మంది మహిళలు వినియోగించారని వెల్లడించారు. 21.12 లక్షల మంది నగదు చెల్లించి బస్సుల్లో ప్రయాణం చేశారని పేర్కొన్నారు. రాఖీ పర్వదినం రోజున రికార్డు స్థాయిలో రూ.32 కోట్ల రాబడి ఆర్‌టిసికి వచ్చిందన్నారు. అందులో మహాలక్ష్మి పథకం ద్వారా రూ.17 కోట్లు, నగదు చెల్లింపు టికెట్ల ద్వారా రూ.15 కోట్ల వరకు వచ్చిందని తెలిపారు. ఆర్టీసీ చరిత్రలో ఒక్కరోజులో ఇంత మొత్తంలో ఆదాయం ఎప్పుడు రాలేదన్నారు. భారీ వర్షంలోనూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసిన సిబ్బందిని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆర్టీసీ తన మొత్తం సామర్థ్యాన్ని ఉపయోగించుకుందని, ఉద్యోగులు రాత్రి ,పగలు నిరంతరం శ్రమించారని వారి సేవలను కొనియాడారు. క్షేత్రస్థాయి సిబ్బందితో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని రద్దీ ఉన్న రూట్లలో బస్సులు అదనంగా నడిపించి ప్రయాణికులను తరలించడంలో విజయవంతం అయ్యారన్నారు.

రాఖీ పండగ ఉన్నప్పటికీ సిబ్బందికి నిరంతరం శ్రమించారని, ఆర్టీసీ డ్రైవర్లు , కండక్టర్లకు కూడా ఫీల్డ్ లోనే బస్సుల్లో వారి సోదరీమణులు రాఖీలు కట్టారని వారందరికీ అభినందనలు తెలిపారు. మహా లక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో ప్రయాణించి సోదరులకు రాఖీ కట్టారని, వారందరినీ అభినందిస్తూ శుభకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని విజయవంతంగా ఆర్టీసీ అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఆర్టీసీ ఆదరిస్తోన్న, ప్రోత్సహిస్తోన్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..



**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

తరగతి గదుల్లో నిత్యం ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని పాఠ్యాంశాలు చదివించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం కోనరావుపేట మండలం మర్తనపేట ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆఫీస్ కార్యాలయంలో హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేసి, ఎందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారని, 25 మంది విద్యార్థులు చదువుతున్నారని, హెచ్ఎం సెలవులో ఉన్నారని, 13 మంది విద్యార్థులు స్కూల్ కు వచ్చారని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయుడు తీసుకెళ్లారు. అనంతరం మధ్యాహ్నం భోజనం తయారు చేసే గదిని పరిశీలించి, నిర్వాహకురాలితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. గదిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి సబ్జెక్టు పై అవగాహన వచ్చేలా బోధించాలని, ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చదవడం, రాయడం, మ్యాథ్స్, ఇంగ్లీష్ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

# మత్స్యకారులకు మంచి ఆదాయం కోసం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడెక్ట్...

- **అక్వా హబ్ గా రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధి..**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడెక్ట్ క్రింద రాజన్న సిరిసిల్ల జిల్లాను అక్వా హబ్ గా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత కలెక్టరేట్ లోని వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడెక్ట్ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పీఎంఎఫ్ ఎంఈ. లో భాగంగా ప్రతి జిల్లా నుంచి అక్కడి పరిస్థితులు, మార్కెటింగ్ అవకా శాలు, పర్యావరణం, కామన్ సర్వీసెస్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఒక ప్రోజెక్ట్ ఎంపిక చేసి దాని ఎగుమతికి , మెరుగైన మార్కెట్ కల్పనకు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడెక్ట్ క్రింద కృషి చేయడం జరుగుతుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడెక్ట్ క్రింద చేపల ఎగుమతి చేసేందుకు నిర్ణయం తీసుకో వడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఉన్న 300 ఎకరాల భూమి, అదేవిధంగా 450 చెరువులలో చేపల ఉత్పత్తి చేసి వాటికి మంచి మార్కెట్ డిమాండ్ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడెక్ట్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మత్స్యకారులకు మార్కె టింగ్ అవకాశాలు పెరిగి వారి ఆదాయం మెరుగవుతుందని, మన సిరిసిల్ల జిల్లా చేపలు ఇతర రాష్ట్రాలకు దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మంచి డిమాండ్ కలుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ శేషాద్రి జిఎం ఇండస్ట్రీస్ భారతి అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్, ఎల్డీఎం మల్లికార్జున్ జిల్లా మత్స్య శాఖ అధికారి వరదా రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్ రామచంద్రం సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**రెండు రోజుల్లో ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి :**
**అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్**

పెండింగ్ లో ఉన్న ధరణిలో దరఖాస్తులను రెండు రోజుల్లో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు, అన్ని మండలాల తహశీల్దార్లతో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే రెండు రోజుల్లోగా దరఖాస్తులను పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ,తహాశీల్దార్ల లాగిన్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే ఆర్డీఓ లకు తహాశీల్దార్ల పంపించాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ ఆదేశించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై ఆరా తీశారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న 763 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నట్లు పేర్కొన్నారు. సూచించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు రమేష్, రాజేశ్వర్, మండలాల తహాశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



## రాజన్నను దర్శించుకున్న మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద...

**బలగం టీవీ , వేములవాడ :**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.కమిషన్ చైర్ పర్సన్ దంపతులకు ఆలయ అర్చకులు మరియు ఈఓ కె వినోద్ రెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికారు.స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనము చేశారు.ఆలయ ఈఓ వినోద్ రెడ్డి శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందించారు.ఈ కార్యక్రమం లో ఆలయపర్యవేక్షకులు బి తిరుపతిరావు ఉన్నారు

# జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్..

- **గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి...**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో గంజాయి నిర్మూలనకై ప్రతి ఒక్కరూ పాటుపడాలని, గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ లు ,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు నిర్వహిస్తునే గంజాయి వలన కలుగు అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడాని జిల్లా పోలీస్ విన్నూత కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పింస్తుదని, జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతున్నదన్నారు.

జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ లు చేస్తూ గంజాయి సేవించే వారిని ,వారికి గంజాయి అందిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్నవారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఏర్పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించిన,సాగు చేసిన, రవాణా చేసిన సేవించిన వారి సమాచారం ఆర్ ఎస్ – ఎన్ ఏ బీ 8712656392 నంబర్ కి అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుదని,గంజాయి కి అలవాటు పడిన వారిని పోలీస్ డి ఆడిక్షన్ సెంటర్ లో కౌన్సెలింగ్ కోసం పై నంబర్ ని సంప్రదించాలని తెలిపారు.



# డ్రగ్స్ నిర్మూలనకు అవగాహన కార్యక్రమం

- **డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం**
- **ఎస్సై డి సుధాకర్**

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని పల్లెల్లో ప్రవహిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు స్థానిక ఎస్సై డి. సుధాకర్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డ్రగ్స్ మద్యం ద్వారా కుటుంబాలు చిన్నాభిన్నం కావడంతో పాటు అనారోగ్యాల బారిన పడతారని సూచించారు. యువత మత్తు సేవించి కొన్ని సందర్భాల్లో జైలు పాలు అవుతున్నారని మద్యం సేవించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరుకుతున్నారని వారికి పరీక్షలు చేయడానికి అనేక పరికరాలు వచ్చాయని రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ పై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని గ్రామాల్లో గంజాయి వంటి మాదకద్రవ్యాలు సాగు చేస్తున్నట్లుగాని,రవాణా చేస్తున్నట్లుగాని, సేవిస్తున్నట్లుగాని, విక్రయిస్తున్నట్లుగాని తెలిస్తే పోలీసువారికి ఈ నెంబర్ కి 8712656392 తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సై డి సుధాకర్, డాగ్ స్క్వాడ్ పోలీసులు,కార్తీక్, అబ్బాస్, నరేందర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కావాలనే రాద్ధాంతం చేస్తున్నారు

- **గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు**
- **బాగా చదువుతున్నారు ర్యాంకులు సాధిస్తున్నారు**
- **అనుమతి విషయంలో నిబంధనలు పాటిస్తాం**
- **బద్దెనపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ**

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బద్దనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బంది లేదని ప్రిన్సిపాల్ పద్మ తెలియజేశారు. రాఖీ పండుగ సందర్భంగా కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.పై అధికారుల ఆదేశాల మేరకే ఎవరినైనా లోపలికి అనుమతి ఇస్తాము కానీ ఆదేశాలు లేనిది గురుకుల పాఠశాలలోనికి అనుమతించబోమని అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను అనుమతి ఇచ్చాము కానీ కొందరు దుష్ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టించాలని ఆరోపించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉన్న విద్యార్థులు బాగా చదువుతున్నారని వారికి ఎలాంటి ఇబ్బంది లేదని విద్యార్థులు బాగా చదువుతూ ర్యాంకులను సాధిస్తున్నారన్నారు. తాను పనిచేస్తున్న నాటినుండి నేటి వరకు ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి ర్యాంకులు వస్తున్నాయని దానికి నిదర్శనం గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి అని అన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకొని కొందరు తల్లిదండ్రులు రావడంతో లోపలికి అనుమతించామని అన్నారు. అందరిని అనుమతిస్తే ఆడబిడ్డలు చదువుకునే పాఠశాల కాబట్టి ఎవరు వస్తున్నారు ఎవరు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది కాబట్టే మేము కూడా విద్యార్థుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులకు ఏమైనా జరుగుతే మళ్లీ తల్లిదండ్రులే తమను ప్రశ్నిస్తారని అందుకనే లోపలికి తెలియని వారిని ఎవరిని కూడా అనుమతించడం లేదని ప్రిన్సిపల్ పద్మ అన్నారు. గురుకుల పాఠశాలలో చదివే ఐదవ తరగతి విద్యార్థి నుండి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థి వరకు ర్యాంకులు సాధిస్తున్నారని తమ పనితనం బాగా లేకుంటే విద్యార్థులు ఎలా ర్యాంకులు సాధిస్తారని అన్నారు. గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు అధ్యాపకులు అంకితభావంతో పనిచేస్తున్నారని వారు కృషి వల్లనే ర్యాంకులు రాష్ట్రస్థాయిలో సాధించగలుగుతున్నామని అన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు గురుకుల పాఠశాల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రిన్సిపల్ పద్మ తెలియజేశారు. రాఖీ పండుగ సందర్భంగా ఒక్క విద్యార్థికి సంబంధించి ఎనిమిది మంది వచ్చిన గాని లోపలికి అనుమతించామని కానీ వారే దుష్ప్రచారం చేస్తూ మీడియాకు తప్పుడు సమాచారం అందించి గురుకుల పాఠశాలలో అనుమతించడం లేదని ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. బద్దనపల్లి గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయిలో మంచి పేరు ఉందని ఆ పేరును ఎవరు కూడా దుష్ప్రచారం చేస్తూ కళాశాలకు చెడ్డ పేరు తీసుకురాకూడదని, గురుకుల పాఠశాలలో బాగానే చదువు చెబుతున్నారని కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తూ గురుకుల పాఠశాలను బదనం చేస్తున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. మరోసారి కళాశాల ప్రిన్సిపాల్ పై ఆరోపణలు చేస్తే సహించబమని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.






## బద్దెనపల్లి గురుకుల ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోండి...

- **ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్**

**బలగం టీవీ , సిరిసిల్ల :**

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రాఖీ పౌర్ణమి సందర్భంగా తోబుట్టువులకు రాఖీ కట్టనివ్వకుండా కర్కశంగా వ్యవహ రించిన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపెల్లి మండలం బద్దె నపల్లి ప్రిన్సిపాల్ సస్పెండ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలోని జిల్లా కలెక్టరేట్లో తోబుట్టువులకు రాఖీ కట్టనీయకుండా అడ్డుకున్న ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ మాట్లాడుతూ గు రుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో ప్రతి పండుగ సందర్భంగా రాఖీలు కట్టించుకోవడానికి తల్లిదండ్రులు కుటుంబ సమేతంగా వస్తే,ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు వారిని పాఠశాల గేటు తెరవకుండా అందుకున్నారని అన్నారు. పిల్లల్ని బయటకి పంపించమని అడిగినా కనికరం చూపలేదు అని,దీంతో చేసేదేమీ లేక ఆశగా వచ్చిన అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు కిటికీలోంచి రాఖీలు కట్టారు అని అన్నారు.గురుకుల విద్యార్థులు రక్షా బంధన్ చేసుకోలేని దుస్థితి అని,తల్లితండ్రులు కన్నీళ్లతో ఇంటికి వెళ్లిపోవడం అత్యంత బాధాకరమైనవిషయమని అన్నారు.మానవతా విలువలను పెంపొందించే పండగలను జరుపుకొనివ్వకుండా, పిల్లలు, తల్లి దండ్రుల పట్ల కర్కశంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలని,లేకుంటే తీవ్ర స్థాయిలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో విభాగ్ లా ఫోరమ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్,టౌన్ జాయింట్ సెక్రటరీ కాసారపు నితిన్,టౌన్ వైస్ ప్రెసిడెంట్ రుద్రవేణి ధనుష్,వెంకటేష్,వంశీ తదితరులు పాల్గొన్నారు.




## కోనరావుపేట ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక...

**బలగం టీవీ, సిరిసిల్ల :**

కోనరావుపేట మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దప్పుల కరుణాకర్(ప్రజాపక్షం),గౌరవ అధ్యక్షుడిగా మల్యాల ప్రసాద్(ఆంధ్రప్రభ),ఉపాధ్యక్షులుగా దండు దేవేందర్ (మెట్రో న్యూస్), చీటీ కళ్యాణ్(వాస్తవం), ప్రధాన కార్యదర్శి ధూంపేట నాగరాజు(భారత్ వార్త), కోశాధికారి మాంధాల సంజీవ్(విశాల ఆంధ్ర),సంయుక్త కార్యదర్శి గొర్రె సుధాకర్(తెలుగు ప్రభ),గండి నరేష్(దిశ), కార్యవర్గ సభ్యులు డప్పుల నరేష్(ప్రజా జ్యోతి), సాసాల సురేష్(మైత్రి న్యూస్),అన్న బోయిన సురేష్(ఐ.ఎన్.డి న్యూస్),లింగాల ప్రదీప్(రాజ్య పాలన),బంటు నవీన్(ప్రజా జనహితం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేస్తామని మండలంలో పనిచేసే ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టుకి ఇండ్ల స్థలాలు ప్రభుత్వ నుండి అందేలా చూస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకం నుంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ 3 నెలల్లో పూర్తి చేయాలి

**-ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

ఎల్ఆర్ ఎస్ దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని,దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ మూడు నెలలో పూర్తి చేయాలని. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, చేపట్టాల్సిన చర్యలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు, అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి మొత్తం కలిపి 42,941 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ చేసే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ యాప్ డౌన్ లోడ్ చేసే విధానం, వివరాల నమోదుపై వివరించారు. దరఖాస్తుల స్క్రూటినీ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులలో అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరించాలని, జిల్లాలో ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వారు వివరాలు సేకరించి యాప్ లో నమోదు చేయాలనిఅన్నారు.

సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీలలో బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జిపిఎస్ ద్వారా సదరు భూమి కో ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేస్తారని, అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్ , నాలా,చెరువులు ,హెరిటేజ్ బిల్డింగ్ , డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోవి కావని ధ్రువీకరించాలని అన్నారు. ప్రభుత్వ భూముల విషయమై అందరి వద్ద సమాచారం ఉండాలని స్పష్టం చేశారు. నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణలకు పాల్పడలద్దని అధికారులకు సూచించారు. కలెక్టరేట్, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్క్ లు, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ డీటీసీపీఓ అన్సారీ, డీపీఓ వీర బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఆస్ట్రేలియా సిరీస్‌కు షమీ



బలగం టీవి, న్యూఢిల్లీ

రానున్న ఆస్ట్రేలియా సిరీస్‌లో టీమిండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమీ జట్టులోకి వస్తాడని భారత క్రికెట్ బోర్డు కార్యదర్శి జైషా జోస్యం చెప్పారు. షమీ ఈ సిరీస్‌లో ఆడతాడనే నమ్మకం తనకుందన్నారు. గాయాలతో సతమతమై కొంతకాలంగా టీమిండియాకు దూరం గా ఉన్న షమీ ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడన్నారు. ఆస్ట్రేలియా సిరీస్‌లో షమీదే కీలక పాత్రగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. భారత ప్రధాన అస్త్రాల్లో షమీ ఒకడని, అతని అవసరం జట్టుకు ఎంతో ఉందన్నారు. ఇక త్వరలో ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ద్వారా ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలిస్తామన్నారు. ఇందులో రాణించిన ఆటగాళ్లను బంగ్లా సిరీస్‌కు ఎంపిక చేస్తామన్నారు. ఇక భారత్‌లో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదని, ఒకే సమయంలో రెండు బలమైన జట్లను ఎంపిక చేసే సత్తా తమకుందని జైషా పేర్కొన్నారు.

# ఒకే ఓవర్‌లో 39 పరుగులు..



- యువరాజ్ సింగ్ రికార్డు బ్రేక్

బలగం టీవి, న్యూఢిల్లీ

ఒకే ఓవర్‌లో 39 పరుగులు చేసి 17 ఏళ్ల క్రితం యువరాజ్ సింగ్ నెలకొల్పిన టీ20 రికార్డును సమోవా క్రికెటర్ బ్రేక్ చేశాడు. ఆ దేశానికి చెందిన బ్యాటర్ డారియస్ విస్సేర్.. టీ20 మ్యాచ్‌లోని ఒక్క ఓవర్‌లోనే అత్యధిక రన్స్ చేసిన క్రికెటర్‌గా నిలిచాడు. వనాటు దేశంతో జరిగిన మ్యాచ్‌లో ఈ రికార్డును సృష్టించాడు.

ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్‌కప్ సబ్ రీజినల్ ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ ఏ ఈవెంట్‌లో ఏపియాలో జరిగిన మ్యాచ్‌లో విస్సేర్ ఒక్క ఓవర్‌లోనే 39 పరుగులు చేశారు. క్వాలిఫయర్ ఏ మ్యాచ్ 15వ ఓవర్‌లో విస్సేర్ భారీ షాట్లతో అలరించాడు. ఆ ఓవర్‌లో ఆరు సిక్సర్లు కొట్టాడు. స్పీడ్ బౌలర్ నలిన్ నిపికో ఆ ఓవర్‌లో మూడు నో బాల్స్ వేశాడు. 2007లో జరిగిన ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ పేసర్ స్టువార్ట్ బ్రాడ్ బౌలింగ్‌లో యువరాజ్ సింగ్ ఆరు సిక్సర్లు కొట్టి రికార్డు క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. ఒక్క ఓవర్ లో 36 రన్స్ స్కోర్ చేసిన క్రికెటర్లలో ఇతరులు కూడా ఉన్నారు. 2021లో కీరన్ పోలార్డ్ 36, 2024లో నికోలస్ పూరన్ 36 రన్స్, దీపేంద్ర సింగ్ 36 రన్స్ స్కోర్ చేశారు.

నిపికో వేసిన తొలి మూడు బంతుల్లో విస్సేర్ మూడు సిక్సర్లు కొట్టాడు. ఆ తర్వాత రెండు నోబాల్స్ పడ్డాయి. ఇక నాలుగో లీగల్ డెలివరీలికి మరో సిక్సర్ కొట్టాడు. అయిదో బంతిని డాట్ బాల్‌గా వేశాడు. కానీ ఆ తర్వాత మూడో నో బాల్‌ను మరో సిక్సర్‌గా మలిచాడు విస్సేర్. ఆ తర్వాత చివరి బంతిని కూడా సిక్సర్ గా కొట్టాడు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ కొట్టిన తొలి సమోవా క్రికెటర్‌గా విస్సేర్ నిలిచాడు.విస్సేర్ ఇన్నింగ్స్‌లో మొత్తం 14 సిక్సర్లు ఉన్నాయి. 62 బంతుల్లో అతను 132 రన్స్ చేశాడు. దీంతో ఈ టోర్నీలో సమోవా జట్టు రెండో విజయాన్ని నమోదు చేసింది. 2026లో టీ20 వరల్డ్‌కప్ కోసం క్వాలిఫై అయ్యేందుకు ఆ జట్టు ప్రయత్నిస్తోంది.

# యువరాజ్ సింగ్ బయోపిక్.. ప్రకటించిన టీ-సిరీస్

- యువీ క్రీడా ప్రయాణాన్ని మూవీగా తీసుకువస్తున్నట్లు ప్రకటించిన టీ-సిరీస్
- తన జీవిత కథ సినిమాగా రావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన యువీ




బలగం టీవి, న్యూఢిల్లీ

భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ జీవిత చరిత్ర మూవీగా రాబోతున్నట్టు అధికారిక ప్రకటన వచ్చింది. బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్, యువరాజ్ బయోపిక్‌ను నిర్మించనుంది. నిర్మాతలు భూషణ్ కుమార్, రవిభాగ్ చందక్ తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

అయితే హీరో ఎవరు? దర్శకుడు ఎవరు? టైటిల్ ఏంటి? అనే విషయాలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే ఈ ప్రాజెక్టుకి సంబంధించిన పూర్తి వివరాలను ప్రకటించ నున్నట్లు నిర్మాతలు తెలిపారు.


కాగా, 13 ఏళ్ల వయసులో పంజాబ్ అండర్ 16 క్రికెట్ జట్టుకు ఎంపికైన యువరాజ్ ఆ తర్వాత 2000లో అండర్ 19 వరల్డ్ కప్ కూడా ఆడాడు. ఇందులో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచాడు. అనంతరం టీమిండియాకు ఎంపికై 2007 టీ 20 వరల్డ్ కప్ విజయంలో కీరోల్ పోషించాడు. ఒకే ఓవర్‌లో ఆరు సిక్సులు బాది సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు.

ఆ తర్వాత 2011లో భారత జట్టు 28 ఏళ్ల తర్వాత వన్డే ప్రపంచకప్ గెలవడంలోనూ ఆల్‌రౌండర్‌గా యువీనే కీలకంగా వ్యవహరిం చాడు. అదే ఏడాది క్యాన్సర్ బారిన పడ్డాడు. అయినా అధైర్య పడకుండా పోరాటం చేసి క్యాన్సర్‌ను జయించాడు. ఆ తర్వాత 2012 మళ్లీ మైదానంలో అడుగుపెట్టాడు. ఇలా పడిలేచిన కెరటంలా అతడి జీవితం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చింది.

తన మూవీ గురించి యువరాజ్ సింగ్ మాట్లాడుతూ.. "భూషణ్‌కుమార్, రవి ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న నా కోట్లాది మంది అభిమానులకు నా జీవిత కథను అందిస్తుం డటం చాలా గౌరవంగా భావిస్తున్నాను. నా జీవితంలో క్రికెట్‌కు ఎప్పుడూ అత్యున్నత స్థానం ఉంటుంది. ఇక నా ఒడిదుడుకుల జీవిత పాఠం ఇతరులను వారి సొంత సవాళ్లను అధిగమిం చడానికి, అచంచలమైన అభిరుచితో వారి కలలను సాకారం చేసుకోవడానికి స్ఫూర్తిని ఇస్తుందని ఆశిస్తున్నాను" అని యువీ అన్నాడు.

ఇక నిర్మాణ సంస్థ టీ-సిరీస్ ఇప్పటికే తారే జమీన్ పర్, భారత క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ బయోపిక్ 'సచిన్: ఏ బిలియన్ డ్రీమ్స్' డాక్యుమెంటరీ నిర్మాణంలోనూ భాగస్వామిగా ఉన్నారు. ఇప్పుడు మరో క్రికెటర్ యువరాజ్ సింగ్ జీవితాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. దీంతో ఈ బయోపిక్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ప్రాక్టీస్ మ్యాచ్‌ను మూడు రోజులకు పెంచాలి : గవాస్కర్



బలగం టీవి, న్యూఢిల్లీ

ఈ ఏడాది ఆఖర్లో ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా టీమిండియా అయిదు టెస్టుల సిరీస్ ఆడనుంది. అయితే ఆస్ట్రేలియా పర్యటనలో ప్రాక్టీస్ మ్యాచ్‌ను రెండు రోజులకు కుదించారు. దీనిపై భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ లెవన్‌తో జరగాల్సిన మ్యాచ్ రెండు రోజులకు కుదించారని వార్త తెలిసి నిరాశకు గురయ్యానని తెలిపాడు. దీని వల్ల యువ ఆటగాళ్లకు కీలక సాధన మిస్ అవుతుందన్నాడు. మరోవైపు ఈ కారణంతో సీనియర్ ఆటగాళ్లు ప్రాక్టీస్‌కు వెళ్లని పరిస్థితి కూడా ఉంటుందని పేర్కొన్నాడు.

అయితే రెండు రోజుల వార్మప్ మ్యాచ్ కంటే ఫస్ట్ క్లాస్ క్రికెట్ ద్వారా యువ ఆటగాళ్లు ఎక్కువ అనుభవం పొందుతారని అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియా పర్యటన ముఖ్య ఉద్దేశం క్రికెట్ ఆడటమని, విశ్రాంతి తీసుకోవడం కాదని గవాస్కర్ అన్నాడు. అలాగే ప్రాక్టీస్ మ్యాచ్‌ను మూడు రోజులకు పెంచాలని, యువ ప్లేయర్లకు అవకాశం ఇవ్వాలని, దీని కోసం బీసీసీఐ చర్యలు తీసుకోవాలని గవాస్కర్ సూచించాడు. ఆస్ట్రేలియా ప్రతీకారం దాహంతో ఉందని.. కంగారూల గడ్డపై హ్యాట్రిక్ సిరీస్ విజయాలు సాధించాలంటే భారత్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే వార్మప్ మ్యాచ్‌ను మూడు రోజులకు మార్చడానికి ఇంకా సమయం ఉందని... ఈ సాధనలో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని కోరారు. వరల్డ్ టెస్టు ఛాంపియన్స్ ఆస్ట్రేలియాను ఓడించడానికి యువ ప్లేయర్లకు ఇది సాయపడుతుందని. కమాన్ బీసీసీఐ. ఇది మీరు చేయగలరు అని సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు.

# అక్టోబర్ 10న 'వేట్టైయాన్' విడుదల



బలగం టీవి, హైదరాబాద్

హీరో రజనీకాంత్ నటించిన చిత్రం 'వేట్టైయాన్'. జైలర్ తర్వాత ఆయన నటించిన చిత్రం ఇదే. ఈ సినిమా అక్టోబర్ 10న విడుదల చేస్తున్నామని చిత్ర యూనిట్ ప్రకటించింది. టీజే జ్ఞానవేల్ దర్శకుడు. గతంలో సామాజిక సమస్యలే ఇతివృత్తంగా ఆయన జై భీమ్ సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. లైకా ప్రొడక్షన్ సంస్థ పాన్ ఇండియా మూవీగా నిర్మిస్తోంది. రోబో 2.0, దర్బార్, లాల్ సలామ్ వంటి చిత్రాల తర్వాత లైకా ప్రొడక్షన్స్ కలయికలో రాబోతున్న నాలుగో సినిమానే 'వేట్టైయాన్'. పేట, దర్బార్, జైలర్ చిత్రాల ద్వారా అనిరుద్ రవిచందర్ కలయికలో రానున్న నాలుగో సినిమా ఇది. ఈ సినిమాలో బాలీవుడ్ హీరో అమితాబ్‌బచ్చన్ నటిస్తున్నారు. మంజు వారియర్, ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుపాటి, రితికా సింగ్, దుషరా విజయన్, రోహిణి, అభిరామి తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్నారు.


# 'లక్కీ భాస్కర్' వాయిదా

బలగం టీవి, హైదరాబాద్

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న 'లక్కీ భాస్కర్' మూవీ మరోసారి వాయిదా పడింది. ఇంతకు ముందు ఓసారి ఈ సినిమాను వాయిదా వేస్తూ సెప్టెంబర్ 7వ తేదీన విడుదల అని ప్రకటించిన మేకర్స్.. ఇప్పుడు మరోసారి ఈ సినిమాను వాయిదా వేస్తున్నట్లుగా తెలుపుతూ, అందుకు గల కారణాలను తెలియజేశారు. దీపావళికి ఈ సినిమా విడుదల కాబోతున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని, టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న విషయం తెలిసిందే.

నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేయడానికి అదనపు సమయం పడుతున్న కారణంగా సినిమాను అక్టోబర్ 31 తేదీకి వాయిదా వేస్తున్నామని మేకర్స్ తెలిపారు.

# ఇంద్ర రీ రిలీజ్.. చిరంజీవి స్పెషల్ వీడియో



బలగం టీవి, హైదరాబాద్

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 22న ఇంద్ర సినిమా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చిరు స్వయంగా ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "ఇంద్రసేనా రెడ్డి అని అంటుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది.. రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. ఆ సినిమాకు ఉన్న పవర్ అలాంటిది. 'ఇంద్ర' అంత పెద్ద సక్సెస్ కావడానికి ప్రధాన కారణం కథ. అలాగే ఆ చిత్రం కోసం పనిచేసిన వారంతా మనసు పెట్టి శ్రద్ధగా వర్క్ చేశారు. అందుకే ఇప్పటికీ 'ఇంద్ర'కు సంబంధించిన ప్రతీ విషయాన్ని అందరూ గుర్తుపెట్టు కున్నారు. ఆ చిత్రం గురించి మాట్లాడుకుంటున్నారు. ఏ సీన్ నుంచి చూడడం మొదలు పెట్టినా చివరిదాకా చూస్తాం. అదే ఆ కథకు ఉన్న గొప్పతనం. నా సినిమాల్లో అత్యంత సాంకేతిక విలువలున్న ఉత్తమ కమర్షియల్ సినిమా ఇది. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. కథ, స్క్రీన్ ప్లే, ఆర్టిస్టుల నటన, పాటలు, అన్నీ అద్భుతం. ఒక్క మాటలో చెప్పాలంటే కమర్షియల్ చిత్రానికి కచ్చితమైన ఉదాహరణ 'ఇంద్ర'. డైరెక్టర్ బి.గోపాల్ దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా నా ధన్యవాదాలు. 22 సంవత్సరాల తర్వాత ఇప్పుడు రీరిలీజ్ కావడం నాకెంతో సంతోషంగా ఉంది. 2002 జులై 22 'ఇంద్ర' రిలీజ్ సందర్భంగా ఎలాంటి భావోద్వేగానికి గురయ్యానో.. ఇప్పుడు అలానే ఉన్నాను. ఈతరం వాళ్లకు దీన్ని బిగ్ స్క్రీన్‌పై చూపించాలనే ఆలోచన వచ్చిన స్వప్నదత్, ప్రియాంక దత్‌లకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను" అని తన వీడియోలో పేర్కొన్నారు.